క్లుప్తంగా

అజ్జంపూడిలో ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతోంది. గ్రామ సర్పంచి కంచర్ల చిన్నా నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నేతలు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ఆచరణలో అమలు చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు గోడపాటి రాజశేఖర్‌బాబు, కూచిపూడి అన్నపూర్ణ, పలువురు గృహ సారథులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కానూరులో దేవాలయాల హుండీ కానుకల లెక్కింపు



పెనమలూరు: కానూరు గ్రామంలో రెండు దేవాలయాల హుండీల లెక్కింపు గురువారం చేశారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానంలో భక్తులు స్వామివార్లకు సమర్పించిన కానుకలు ఆలయ కార్యనిర్వహణాధికారులు బి.సుబ్బారెడ్డి, వి.జేశ్వంత్‌కేదార్‌ల సమక్షంలో లెక్కించారు. శ్రీ రామలింగేశ్వ్వామివారి ఆలయంలో రూ. 1,53,500 ఆదాయం, శ్రీవేణుగోపాలస్వామివారి దేవస్థానం హుండీలో రూ. 33,680 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. గతంలో కంటే ఆలయ హుండీ ఆదాయం పెరిగిందని అన్నారు.

నూతన విద్యుత్ దీపాలు ఏర్పాటు


రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో గురువారం పలు చోట్ల నూతన విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని మూడు బొమ్మల సెంటర్ నుంచి జాతీయ రహదారిపై ఉన్న బెస్ట్‌ప్రైస్ వరకు అర్‌అండ్‌బీ రహదారి వెంబడి కొత్త దీపాలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న 24 వాట్స్ వీధి దీపాల వెలుగు సరిపోకపోవడంతో వాటిని తొలగించి వాటి స్థానంలో 50 వాట్ల వీధి దీపాలను అమర్చారు. రామానగర్, నెహ్రూనగర్‌లతో పాటు ప్రధాన వీధుల్లో దోమల వృద్ధిని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. పలు వీధుల్లో సోడియం హైడ్రోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు గ్రామంలో దోమల మందు పిచికారి చేయిస్తున్నట్లు సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. ఆర్ అండ్ బీ రహదారిపై వీధి దీపాల వెలుగు చాలకపోవడంతో కొత్తగా 50 వాట్ల వీధి దీపాలను అమర్చామన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్ ఈ పనులను పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి సురక్షిత తాగునీటిని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సొసైటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి రోజు బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. వేసవి కాలం ముగిసే వరకు ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తామని చంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ ముత్తారెడ్డి, ఎంపీటీసీ ప్రసాద రెడ్డి, రవీందర్ రెడ్డి, పోలారెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, జామెట్రీ బాక్స్ పంపిణీ



పెనమలూరు: తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంబేడ్కర్ యూత్ విద్యార్థులకు పుస్తకాలు, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు పానుగుమాటి రాజు, విశేశ్వరరావు, పి.లక్ష్మణ్, కొత్తూరు కోటేశ్వరరావు, గురజా కన్నా, గురజా రంజిత్, గోవాడ శ్రీకాంత్, జంగంసాయి, పి.రాము పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- కంకిపాడు మండల పరిషత్ సమావేశంలో శాఖల వారీ సమీక్ష



కంకిపాడు మండల పరిషత్ సమావేశంలో గృహ నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదేశించారు. కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, ఇరిగేషన్, విద్య, వైద్యం, వైఎస్సార్ క్రాంతి పథం తదితర శాఖలపై ఎమ్మెల్యే పార్థసారథి సమీక్షించారు. అర్హులైన పేదలకు నివేశన స్థలాలను కేటాయించటంతో పాటుగా గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసే బాధ్యతను సమర్థంగా నిర్వహించాలన్నారు. జగనన్న లే అవుట్‌లలో నీరు, విద్యుత్, రహదారులు కల్పన శరవేగంగా సాగాలన్నారు. వసతుల లేమితో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను జాప్యం చేస్తున్నారన్నారు. లే అవుట్‌లలో గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేస్తూ వసతుల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు.

- రబీ సీజన్‌లో ధాన్యం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయని, ధాన్యం సేకరణపై స్పష్టత ఇవ్వాలని సభ్యులు కోరటంతో ఆ శాఖ కమిషనర్‌కు ఫోన్ చేసి ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో మిల్లర్లు, సివిల్ సప్లయీస్ అధికారులతో సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు. పసుపు పంట కొనుగోళ్లకు అవసరమైన సూచనలు చేశామన్నారు.
- ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశం జరిగే వరకూ సభ్యులు సమస్యలపై నోరు మెదపటం లేదని, ఇది సరికాదన్నారు. అందరి భాగస్వామ్యంతో సమస్యలను నిత్యం పరిష్కరించుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కొన్ని శాఖల అధికారులు సమాచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లటంలో వైఫల్యం ఉందని, ఐసీడీఎస్ తదితర శాఖల పనితీరు బాగోలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు.
- జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ సమావేశాలంటే అధికారులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని, పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు కావటం బాధాకరమన్నారు. అలసత్వంగా వ్యవహరిస్తున్న ఉద్యోగులకు మెమోలు జారీ చేసి చర్యలకు సిఫారసు చేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గాప్రసాద్, తహసీల్దార్ టీవీ సతీష్, ఎంఈఓ కనకమహాలక్ష్మి, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ నందిపాటి బిందుమాధవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అంకితభావంతో విద్యాబోధన సాగించి గుర్తింపు పొందాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. డీఎస్సీ–98 అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఆర్డర్స్‌ను గురువారం అందించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో సీఎం జగన్ 98 డీఎస్సీ అభ్యర్థులకు స్పష్టమైన హామీ ఇచ్చారన్నారు. హామీ నెరవేరుస్తూ ఉపాధ్యాయులుగా నియమిస్తూ చర్యలు తీసుకోవటం సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. ఉద్యోగాలు పొందిన డీఎస్సీ–98 అభ్యర్థులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులకు హాజరై విద్యా ప్రమాణాల మెరుగునకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, తహసీల్దార్ టీవీ సతీష్, ఎంఈఓ కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

సమాజంలో ఇంజినీరింగ్ విద్యార్థులు కీలకం

జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు

పెనమలూరు: సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభచాటాలని జేఎన్‌టీయూ–కే వైస్ చాన్సలర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. కానూరులో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ 46వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంజినీరింగ్ చదువుతో పాటు పలు రంగాల్లో రాణించాలని సూచించారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు చదివి అభివృద్ధి చెందాలని సూచించారు. జేఎన్‌టీయుకే అమెరికా, జర్మనీ యూనివర్సిటీలతో ఎంవోయూ చేసుకుందని, ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి అవకాశాలు లభిస్తాయని వివరించారు. విశ్రాంత సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ కొసరాజు వీరయ్యచౌదరి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సాధించాలన్నారు. విద్యార్థులు వారు ఎంపిక చేసుకున్న రంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సిద్ధార్థ కాలేజీ మరింత ఫలితాలు సాధించి ఇంజినీరింగ్ విద్యార్థులకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు సి.నాగేశ్వరరావు, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఉంగుటూరు: అన్ని రంగాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. తేలప్రోలు గ్రామ సచివాలయం వద్ద మండల స్థాయిలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం సంబరాలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓబీసీ వర్గాల్లోని పేదలను ఆదుకోవడానికి ఈబీసీ నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా రూ.15వేలు నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. నవరత్నాల ద్వారా చిన్నపిల్లల దగ్గర నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు అన్ని వర్గాల వారికి ఒక్కో పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందని అన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో 441 మంది ఈబీసీ నేస్తం ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున మొత్తం రూ.66,15,000 నగదు జమ చేసినట్లు తెలిపారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, కార్యదర్శి వి.కృపాకుమార్, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజైన గురువారం ఘనంగా జరిగాయి. ఆలయాన్ని, స్వామి వారిని ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. స్వామి వారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ, మంగళ వాయిద్య గోష్ఠిని అర్చకులు చక్రావధానుల సీతారామానుజాచార్యులు, శ్రీకాంత్ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో చేశారు. అనంతరం అగ్ని ప్రతిష్ట మూలమంత్ర హోమం, సహస్ర పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కాకాని వెంకటేశ్వరరావు (బాబు), తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుంకర సుభాష్ చంద్రబోస్, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రామవరప్పాడు: మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ నిలుస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తమ్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని మహమ్మదీయ మసీదు వద్ద పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ముందుగా మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం షేక్ జమీర్ బాషా, ఖాజా, కబీర్, బిస్మిల్లా బిర్యానీ పాయింట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ ఈ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి అల్లాను ఆరాధిస్తారన్నారు. ఈ ఉపవాస మాసంలో సహరి, ఇఫ్తార్ దావత్‌లు ఇచ్చేందుకు దాతలు ముందుకొస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు నూరుద్దీన్, సెక్రటరీ సయ్యద్ రషీద్, ముస్లింలు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం



గంగూరులో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం రక్తదానం చేశారు. కాలేజీలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో జరిగిన రక్తదాన శిబిరాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడిమయాల రవి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ టీఎస్ఎస్ బాలాజీ, కార్యదర్శి శంకర్‌నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణలు కాపాడవచ్చన్నారు. రక్తదానం చేయటం వల్ల ఆరోగ్యవంతంగా జీవించగలుగుతామని వివరించారు. అన్ని దానాల్లో కల్లా రక్తదానం చాలా గొప్పదని అన్నారు. కాలేజీ విద్యార్థులు 60 మంది రక్తదానం చేశారు. విద్యార్థులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.హనుమంతయ్య, మెకానికల్ హెడ్ రావి సురేష్ బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గోగంరాజు, మెడికల్ కోఆర్డినేటర్ వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

గన్నవరం: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కళ్ళం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళం మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీనికోసం వామపక్షాల ఆధ్వర్యంలో బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలంటూ ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు చేపట్టిన ప్రచారభేరిని జయప్రదం చేయాలని కోరారు. దీనిలో భాగంగా ఈ నెల 23న గన్నవరంలో చేపట్టిన బహిరంగ సభను కూడా జయప్రదం చేయాలని కోరారు.

క్రమం తప్పని సంక్షేమం

- జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం
- గడప గడపకు మన ప్రభుత్వంలో లబ్ధిదారుల హర్షం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న సంక్షేమ పాలనలో తమకు సంక్షేమ పథకాలు క్రమం తప్పకుండా అందుతున్నాయని లబ్ధిదారులు పి.విజయభారతి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పోరంకి ప్రభునగర్ సచివాలయం–5 పరిధిలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌లు పంపిణీ చేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. జగనన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు తమకు క్రమం తప్పకుండా అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు తెలిపారు. జగనన్నపాలనలో తాము ఆర్థికంగా నిలదొక్కుకున్నామని లబ్ధిదారులు అన్నారు.

ప్రజలకు కష్టాలు లేకుండా చూస్తాం..

జగనన్న పాలనలో అన్నివర్గాల ప్రజలకు కష్టాలు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. జగనన్న పాలన పారదర్శకంగా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా ఉందన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా జగనన్న పాలనకు పూర్తి మద్దతు ఇవ్వాలని, ప్రతిపక్ష ఆరోపణలు తిప్పికొట్టాలని అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమోతు జీవన్, అద్దేపల్లి చందు, అంకెం రాజేష్, ఉప్పాల వీరబాబు, వీర్ల బుజ్జి, పి.రవి, చుండూరు శేఖర్, ముచ్చు నాగేంద్ర, రచ్చా వెంకటేశ్వరరావు, బొర్రా వెంకటరమణయ్య, ఆకునూరు సుబ్బారావు, గుమ్మడి విజయ్‌కుమార్, మాదు రమేష్, ఆంజనేయప్రసాద్, చాన్‌బాషా పాల్గొన్నారు.

నిధుల పంచాయితీ తేల్చండి

పెనమలూరు: స్థానిక గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై లెక్కలు తేల్చాలని డీఎల్‌పీవో సంపత్‌కుమారి కార్యదర్శులను ఆదేశించారు. పెనమలూరు గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేసిన షేక్ షంషుద్దీన్ ప్రజల వద్ద వసూళ్లు చేసిన ఇంటి పన్నులు, నీటి పన్నులు రూ. 47,03,953 దుర్వినియోగం చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నిధుల దుర్వినియోగం పై డీఎల్‌పీవో సంపత్‌కుమారి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా గురువారం పెనమలూరులో గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు ఏఎస్ఆర్.కోటేశ్వరరావు, ఎం.సరోజిని,ఎంపీయు.ప్రసాద్, కె.రాధాకృష్ణను గురువారం విచారణకు రావాలని డీఎల్‌పీవో ఆదేశించారు. అధికారులు విచారణలో ప్రసాద్ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమయంలో బిల్లుకలెక్టర్ వసూళ్లు చేసిన రూ. 25 లక్షలు ట్రెజరీకి జమ చేయలేదని గుర్తించినట్లు సమాచారం. ఇదే విధంగా ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ కూడా జమ ఖర్చుల వివరాలు తేల్చి వివరాలు రాతపూర్వకంగా సమర్పించాలని ఆదేశించారు. పైగా బిల్లు కలెక్టర్ షంషుద్దీన్‌కు చోడవరం గ్రామ పంచాయతీకి బదిలీ అయిన సమయంలో రికార్డు అప్పగించకుండా ఎలా రిలీవ్ చేశారనే విషయమై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



ఉయ్యూరు: శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తామని ఉయ్యూరు రూరల్ నూతన ఎస్ఐ సీహెచ్ అవినాష్ అన్నారు. ఉయ్యూరు రూరల్ ఎస్ఐ తిరుమలరావు హనుమాన్‌జంక్షన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పామర్రు నుంచి బదిలీపై సీహెచ్ అవినాష్ ఉయ్యూరు వచ్చారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలి

రామవరప్పాడు: ఒక్క పక్క ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, మరో పక్క రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో గురువారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి గడప గడపకు పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో భూమి సారవంతం



ముస్తాబాదలో వీఏఏలకు ఆదేశాలిస్తున్న ఏడీఏ సునీల్, ఏవో తేజశ్వి

గన్నవరంరూరల్: మట్టి పరీక్షలు చేసుకోవటం ద్వారా భూమిలో ఉన్న పోషకాలను తెలుసుకునే వీలు కలుగుతుందని గన్నవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం.సునీల్ చెప్పారు. మండలంలో జరిగే మట్టి పరీక్షా వారోత్సవాలను ఆయన గురువారం ముస్తాబాదలో ప్రారంభించారు. అనంతరం ఆర్‌బీకేలో జరిగిన రైతుల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ భూసార పరీక్షకు మట్టి నమూనాలు సేకరించటం తులనాత్మకంగా చేయాలన్నారు. వీఏఏల బాధ్యత ఎంతో కీలకమని, ప్రతి రైతుకు మట్టి పరీక్షల ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రతి ఆర్‌బీకే నుంచి రెండు మట్టి నమూనాలు తప్పక సేకరించాలని ఆదేశించారు. ఏవో ఎన్ఎల్ తేజశ్వి మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించకుండా, భూములు చౌడు బారకుండా మట్టి పరీక్షలు ఉపయోగపడతాయన్నారు.

బాపులపాడులో 'జగనన్నే మా భవిష్యత్తు'

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలితాలపై అడుగడుగున కృతజ్ఞతలు తెలుపుతున్నారని ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడులోని గ్రామ సచివాలయం–2, వీరవల్లి, రంగన్నగూడెం గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో పాటుగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుతం వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. ఇంటి యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను వారి ఇంటి తలుపులు, గేట్లకు అంటించారు. ప్రజాభిప్రాయాన్ని సేకరించి, ఆ పత్రంపై ఉన్న నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, కోడెబోయిన బాబి, కసుకుర్తి శ్రీనివాసరావు, కొమరవల్లి కిరణ్‌మూర్తి పాల్గొన్నారు.

మూడు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బుద్ధవరం(గన్నవరం): మండలంలోని బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో మూడు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. వివరాలిలా వున్నాయి. కాలనీకి చెందిన కర్నాటి కోటయ్య పశువులను మేపుకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో పశుగ్రాసం కోసం నిల్వచేసిన మూడు ఎకరాల వరిగడ్డి వామికి మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. గాలులకు మంటలు ఎగిసిపడడంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న గన్నవరం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అతికష్టం మీద అదుపులోకి తీసుకువచ్చారు. వరిగడ్డి వామి పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు సమాజంపై అవగాహన అవసరం

గన్నవరంరూరల్: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కె.శారదాదేవి అన్నారు. మండలంలోని మాదలవారిగూడెం లింగయ్యాస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కృష్ణాజిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈవ్‌టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్, డ్రగ్ ఎబ్యూస్ అంశాలపై ఆమె మాట్లాడారు. సమాజంలో డ్రగ్ మాఫియా పెచ్చరిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కెరీర్ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశాలపై నిరంతరం సదస్సులు జరిగితే విద్యార్థుల్లో చైతన్యం పెరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్‌లను నిరోధించాలన్నారు.

నేడు బీఎస్‌పీ రాష్ట్ర సమావేశం

ఉయ్యూరు: బహుజన సాహిత్య అకాడమీ 3వ రాష్ట్రస్థాయి సమావేశం ఉయ్యూరులో శుక్రవారం నిర్వహించనున్నట్లు బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. జాతీయ రహదారి వెంబడి గ్రీన్ ల్యాండ్స్ ఆవరణలో సాయంత్రం 6 గంటల నుంచి జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరవుతున్నారన్నారు. బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు.